క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో సబ్‌డివిజన్ పరిధిలోని పత్తికొండ, బైరెడ్డిపల్లి సబ్‌స్టేషన్లలో కొత్తలైన్ల ఏర్పాటు కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సరఫరా ఉండదని స్థానిక ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సుబ్రమణ్యస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

సదుం: మండల కేంద్రంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకుంది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.

విరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు



పుంగనూరు: పట్టణంలోని శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు చలిపిండి, చల్లముద్దతో దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పసుపు, కుంకుమ అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని బాటగంగమ్మ మంగళవారం పసుపు, కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

ఘనంగా నాగదేశ్వరస్వామి ఉత్సవాలు

గుడుపల్లె: కాడేపల్లె గ్రామంలోని నాగదేశ్వర స్వామి ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. సోమవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి స్వామివారిని ప్రత్యేక అలంకరించి పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రమణీయం.. రథోత్సవం



బైరెడ్డిపల్లె: మండలంలోని శెట్టిపల్లెలో ఉన్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం రథోత్సవం కనుల పండువగా సాగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం రంగురంగుల పుష్పాలతో అలంకరించిన బ్రహ్మరథంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయం చుట్టూ రథాన్ని ప్రదక్షిణలు చేశారు.

కోలాహలంగా రథోత్సవం

కుప్పంరూరల్: మండలంలోని సామగుట్టపల్లి వద్ద వెలిసిన కదిరిబండ నరసింహస్వామి రథోత్సవం మంగళవారం కోలాహలంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం రథాన్ని గ్రామం వీధుల్లో ఊరేగించారు. రథోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు కర్పూరహారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా వరదరాజుని కల్యాణోత్సవం



పలమనేరు: మండలంలోని కూర్మాయి గ్రామంలో వెలసిన శ్రీకూర్మ వరదరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు స్వామివారి పుష్పపల్లకి సేవ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే పట్టణంలోని ఎద్దుల సంతవీధిలోని మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి పీఠంలో త్రిశూల ప్రతిష్ట జరిగింది.

వేడుకగా కదిరిపౌర్ణమి తిరునాళ్ల

చౌడేపల్లె: మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ బయ్యప్పల్లె వద్ద వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కదిరి పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షలతో భక్తులు స్వామివారికి అభిషేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

విశేష 'స్పందన'



స్పందనలో అర్జీ ఇస్తూనే సెల్‌కు వచ్చిన ఎస్‌ఎంఎస్



సమస్య పరిష్కారం కాగానే వచ్చిన మెసేజ్

- స్పందన వినతులపై అధికారుల ప్రత్యేక దృష్టి
- నిర్ణీత గడువులో పరిష్కారమవుతున్న సమస్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అర్జీదారులు



కీలపట్లలో భూమి హద్దుల సమస్యను పరిష్కరిస్తున్న సర్వేయర్, రెవెన్యూ అధికారులు

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం అమలు చేస్తున్న స్పందన కార్యాక్రమానికి ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్, డివిజన్ కార్యాలయంలో ఆర్‌డీఓ, మండలాల్లో తహసీల్దార్లు స్పందన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అర్జీ ఇచ్చిన 15 రోజుల్లో వాటిని పరిష్కరిస్తున్నారు. స్పందన అర్జీలపై ఎప్పటికప్పుడు అర్జీదారు మొబైల్‌కు స్టాటస్ సందేశాలు సైతం వస్తుంటాయి. దీంతో అధికారులు ఎప్పుడు విచారణకు వస్తారో సైతం ముందుగానే తెలుస్తోంది. కార్యాలయాల వద్దకెళ్లకుండా ఇళ్ల వద్ద ఉండగానే సమస్యలు తీరుతున్నాయి. ఈ విధానం చాలా బాగుందని సమస్యలు పరిష్కరించుకున్న పలువురు చెబుతున్నారు.

ఇదిగో సాక్ష్యం

నియోజకర్గంలోని గంగవరం మండలం కీలపట్ల గ్రామానికి చెందిన వినీత తనపొలం హద్దులు చూపాలని స్థానిక అధికారులకు గత నెలలో అర్జీ ఇచ్చింది. సర్వేచేసిన అధికారులకు ఎదురు పార్టీ నుంచి అభ్యతరాలు రావడంతో సమస్య జఠిలంగా మారింది. దీంతో 15 రోజుల క్రితం వినీత జిల్లా కలెక్టర్‌కు స్పందనలో అర్జీ సమర్పించింది. దీంతో డివిజన్ సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారులు మంగళవారం వివాదాన్ని పరిష్కరించారు. భూమి యజమాని తాను విక్రయాలు చేసేటప్పుడు ఇద్దరికి ఒకే హద్దులను పెట్టి పత్రం రాయడంతో వివాదానికి కారణమైంది. ఈ సమస్యను తెలుసుకున్న అధికారులు అర్జీదారు వినీత, అభ్యంతరం తెలిపిన విశ్వనాథయ్యలకు విపులంగా వివరించారు. దీంతో వారు పరస్పర అంగీకారానికి రావడంతో సమస్య పరిష్కారమైంది.

ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం

ప్రతి సోమవారం స్పందనలో ఆర్‌డీఓ కార్యాలయానికి సగటున 10, జిల్లా కేంద్రం నుంచి 6, తహసీల్దార్ కార్యాలయాల్లో 5 చొప్పున ఐదు మండలాల్లో 36 వరకు అర్జీలందుతున్నాయి. వీటిలో కోర్టు కేసులు మినహా మిగిలిన సమస్యలను నిర్ణీత గడువు 15 రోజుల్లో అధికారులు పరిష్కరిస్తున్నారు.

ఇంత త్వరగా అవుతుందనుకోలేదు



15 రోజుల క్రితం స్పందనలో అర్జీ ఇచ్చాం. రిజిస్టర్ అయినట్టు ఎస్ఎంఎస్ వచ్చింది. మంగళవారం ఫీల్డ్‌లో విచారణ చేస్తారని వచ్చిన మెసేజ్ చూశాను. దీంతో పొలం వద్దకెళ్లగానే అధికారులందరూ సిద్ధంగా ఉన్నారు. సమస్యను పరిష్కరించారు. ఆపై సెల్‌కు పరిష్కారమైనట్లు మళ్లీ ఎస్ఎంఎస్ అందింది. నిజంగా ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న స్పందన కార్యక్రమానికి వందనం.

– వినీత, అర్జీదారు, కీలపట్ల

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



గుడుపల్లెలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని చిత్తూరు ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని గుడుపల్లె, సంగనపల్లె, సోడిగానిపల్లె, పాగురుపల్లె గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోని పట్టభద్రుల ఇళ్ల వద్దకు వెళ్లి తమ ఓటును శ్యాంప్రసాద్‌రెడ్డికి వేయాలని అభ్యర్థించారు. ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, మండల కన్వీనర్ రామక్రిష్ణ పాల్గొన్నారు.

సదుం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి మండలంలోని రెడ్డివారిపల్లెలో మంగళవారం ప్రచారం చేశారు. 79 ఏ చింతమాకులపల్లెలో జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌లు ఉషారాణి, హనుమంతరెడ్డి, మల్లికార్జుననాయుడు, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడి, సర్పంచ్‌లు ఇంటింటా ప్రచారం చేశారు.

సోమల: మండలంలో ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర, సయ్యద్‌బాషా, గంగాధరం, రాశెట్టి మధు తదితరులు శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు.

వి.కోట: శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ఎంపీపీ యువరాజు కోరారు. మండలంలోని ముదరందొడ్డి, కుంభార్లపల్లి, కొంగాటం, పాముగానిపల్లి, ఓగు పంచాయతీల్లో పర్యటించారు. వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, తమీమ్‌ఖాన్, సచివాలయాల కన్వీనర్ కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

పలమనేరు: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలంటూ వార్డు కౌన్సిలర్లు ప్రచారం చేశారు. రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, పట్టణ కన్వీనర్ జాఫర్, కౌన్సిలర్లు హయాత్ పాల్గొన్నారు.

రామకుప్పం: మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, టౌన్ అధ్యక్షుడు అప్పి, వార్డు సభ్యుడు జమీను ప్రసాద్, సచివాలయ కన్వీనర్ జబీవుల్లా, సింగిల్‌విండో డైరెక్టర్ నారాయణస్వామి, యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

హోలీ సంబరాలు



సదుం: పండుగ సంబరాల్లో మార్వాడీలు



బైరెడ్డిపల్లెలో సంబరాలు చేసుకుంటున్న రాజస్థానీలు



రొంపిచెర్లలో హోలికా దహనం చేస్తున్న యువకులు

సదుం: మండల కేంద్రంలో మార్వాడీ కుటుంబాలు మంగళవారం హోలీ సంబరాలు చేసుకున్నాయి. వ్యాపార రీత్యా కొన్నేళ్లుగా రాజస్తాని మార్వాడీ కుటుంబాలు ఇక్కడ నివాసం ఉంటున్నాయి. చిన్నారులు, పెద్దలు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. బంధువులు, సన్నిహితుల ఇళ్లకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

బైరెడ్డిపల్లె: హోలి పండుగను బైరెడ్డిపల్లెలోని రాజస్థానీలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు రంగు చల్లుకుని సందడి చేశారు. పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని ఆయిమాతా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రొంపిచెర్ల: మండలంలో స్థిరపడిన రాజస్థానీయులు హోలీ పండుగను సోమవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. సాయిబాబా గుడి ఎదురుగా హోలికను అగ్ని మంటల్లో వేసి దహనం చేశారు. అనంతరం కామ దహనం కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం ఉదయం రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

త్వరలో మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తాం

వి.కోట: మే నెలలోగా మార్కెట్ పనులు పూర్తి చేసి మామిడి రైతులకు అందుబాటులోకి తెస్తామని పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శివినికుప్పం వద్ద నూతనంగా నిర్మిస్తున్న మినీ మార్కెట్ యార్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి మామిడి సీజన్ లోపు మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

రాతిదూలం పడి కార్మికుడి మృతి

నార్పల: ఆలయ నిర్మాణ పనుల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. రాతిదూలం మీదపడి కార్మికుడు దుర్మరణం చెందారు. అనంతపురం జిల్లా నార్పల మండలం కేసేపల్లిలో ఈ ఘటన జరిగింది. చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన గోపీ (40) అనే కూలీ కేసేపల్లిలో చౌడమ్మ ఆలయ నిర్మాణ పనులకు వచ్చాడు. మంగళవారం రాత్రి దూలం నిలబెట్టే క్రమంలో అదుపుతప్పి గోపీ మీదపడింది. తీవ్రంగా గాయపడిన గోపీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ రాఘవరెడ్డి కేసు నమోదు చేశారు.

హెల్పింగ్ హ్యాండ్స్‌కు ఎంపీ ప్రశంస

శాంతిపురం: రాళ్లబూదుగూరులో బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఉచిత వైద్య సేవలు అందించిన హెల్పింగ్ హ్యాండ్స్‌ను ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ ప్రశంసించారు. రథోత్సవంలో పాల్గొనేందుకు సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు రావడంతో వారి కోసం గ్రామ యువకులు హెల్పింగ్ హ్యాండ్స్ పేరిట జట్టుగా ఏర్పడి ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయించారు. దీనిని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్సీలు నిర్వాహకులను ప్రశంసించారు. వీరి వెంట కుప్పం రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసులు, ఎంపీపీ వసుంధర, నేత బుల్లెట్ దండపాణి ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్

రొంపిచెర్ల : పీలేరులో నిర్వహించిన కరాటే పోటీల్లో రొంపిచెర్లలోని ఆకాష్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచారు. మొత్తం 12 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, ఆరు స్వర్ణం, ఐదు రజతం, ఒక కాంస్య పతకాన్ని సాధించారు. సత్తా చాటిన విద్యార్థులను మంగళవారం విద్యాసంస్థ చైర్మన్ పసుపులేటి చంద్రశేఖర్, సంగీత, కరస్పాండెంట్ ద్వారక, ప్రిన్సిపల్ వందనారెడ్డి అభినందించారు.

మహిళలను ప్రతిఒక్కరూ గౌరవించాలి



మహిళా టీచర్లకు సత్కారం



పలమనేరు: మాట్లాడుతున్న సీడీపీఓ మాధవిలత

కుప్పంరూరల్: మహిళలను ప్రతిఒక్కరూ గౌరవించాలని చందం ఉన్నత పాఠశాల హెచ్ఎం మోహన్ సింగ్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. పాఠశాలలోని మహిళా టీచర్లను సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

పలమనేరు: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సీడీపీఓ మాధవిలత పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, శిరీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం



భోజనం రుచి చూస్తున్న ఎంపీడీఓ నాగరాజ

సోమల: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంపీడీఓ నాగరాజ అన్నారు. మంగళవారం మండలంలోని తుగడంవారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం పొదలగుంటపల్లె, 81 చిన్న ఉప్పరపల్లె పంచాయతీల్లోని గ్రామ సచివాలయాలు, జగనన్న కాలనీలను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు ప్రజల నుంచి వచ్చే వినతులను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది, వలంటీర్ల హాజరును పరిశీలించి పలు సూచనలు చేశారు. జగనన్న కాలనీలో గృహాలను పరిశీలించారు. ఉగాది నాటికి పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణంరెడ్డి, సర్పంచ్‌లు జయరాం, శీలం సిద్ధులమ్మ పాల్గొన్నారు.

పొలంబడితో అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

వి.కోట: పొలంబడి కార్యక్రమంతో పంటల్లో నాణ్యమైన దిగుబడులు, సాంకేతిక విధానాలపై రైతులకు అవగాహన పెంపొందుతుందని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండల వ్యవసాయ సంచాలకులు అన్నపూర్ణాదేవితో కలిసి బైరుపల్లిలోని మొక్కజొన్న పంటను పరిశీలించారు. అనంతరం పత్రపల్లి, తోటకనుమ రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఏఓ రాజ్యలక్ష్మి, రైతు భరోసా సిబ్బంది మోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి



కోగిలేరు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: ఈ నెల 13వ తేదీ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండలంలోని ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఎన్నికల నియమావళిని పాటించాలని ఎంపీడీఓ, నోడల్ ఆఫీసర్ టి.శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. మంగళవారం కోగిలేరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎన్నికల కోసం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, పట్టభద్రులకు వేర్వేరుగా రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లకు ఇబ్బంది లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం



ఆలయంలో సత్యనారాయణ వ్రతం చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



గరుడవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయం అయిన వరదరాజుల స్వామి ఆలయంలో అర్చకులు మంగళవారం శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం శ్రీదేవి, పెరుందేవి సమేత వరదరాజుల స్వామివారికి అభిషేకం, అలంకరణ, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని సత్యనారాయణ స్వామి అవతారంలో అలంకరించి, ఆలయ ఆవరణలో కొలువు తీర్చి వ్రతం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, వ్రతం ఆచరించారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంలో కొలువు తీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు స్వామివారికి కర్పూర హరతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు.

నియామకంపై హర్షం





వెంకటేష్‌బాబుకు సన్మానం, ఫక్రుద్దిన్‌షరీఫ్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

పుంగనూరు: వైఎస్సార్‌సీపీలో రాయలసీమలోని చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వాణిజ్య విభాగం ఇన్‌చార్జ్‌గా పట్టణానికి చెందిన దొంతి వెంకటేష్‌బాబు.. అలాగే మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్‌గా పట్టణానికి చెందిన ఫక్రుద్దిన్‌షరీఫ్‌ను నియమించారు. వీరి ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. వారిని ఘనంగా సన్మానించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌రాజు, భానుప్రకాష్, అమరావతి సురేష్, త్రిమూర్తిరెడ్డి, సుబ్బరాయప్ప, అర్షద్ అలీ, ఇబ్రహిం పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

తవణంపల్లె: మండలంలోని ఎగువ తడకరలో ఇరువర్గాలు ఘర్షణ పడడంతో 11 మందిపై కేసు నమోదు చేసినట్లు తవణంపల్లె ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. దిగువ తడకర దళితవాడకు చెందిన సుధాకర్ ఎగువ వెంకటాపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ పొలంలోకి వెళ్లగా ఇరువురు మధ్య ఘర్షణ జరిగింది. కులంపేరుతో దూషించాడని సుధాకర్ ఫిర్యాదు మేరకు సత్యనారాయణ మరో నలుగురిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అలాగే సత్యనారాయణ భార్య మాధవి సుధాకర్ తమ పొలంలోకి ప్రవేశించి తనపై అసభ్యంగా ప్రవర్తించి, చేయి పట్టుకున్నాడని ఫిర్యాదు చేయగా సుధాకర్ మరో ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇద్దరిపై నాన్‌బెయిల్‌బుల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత.. ఒకరి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

చిత్తూరు అర్బన్: బంగారుపాళెం మండలంలోని టేకుమంద గ్రామంలో మంగళవారం ఎస్ఈబీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ దాడుల్లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న గిరి (24) అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 144 ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్ బాబు, సిబ్బంది కృష్ణయ్య, నాగరాజు, సుబ్రమణ్యం గౌడు, వేంకటేష్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: సచివాలయాల్లో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని నెర్నిపల్లి, తోటకనుమ, జవునపల్లి, కష్టాపురం, గోనుమాకులపల్లి సచివాలయాలను సందర్శించారు. సచివాలయాల్లో ప్రతి రోజూ స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గోనుమాకులపల్లి, తోటకనుమ, కష్టాపురం పంచాయతీల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను స్పందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.